సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం : 19 ఏప్రిల్ 2024



విశాఖ ఎయిర్‌పోర్టు దూకుడు!

విశాఖ ఎయిర్‌పోర్టుకు ప్రయాణికుల తాకిడి నెలకొంది. గతేడాది కన్నా, ఈ ఏడాది రాకపోకలు సాగించే వారి సంఖ్య పెరిగింది.

8లో



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు.

గరిష్ఠం 38.4 డిగ్రీలు

వాతావరణం

సాక్షి, పాడేరు: జిల్లాలో గురువారం అరకులో 33 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 36, చింతపల్లిలో 38.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

21 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు పూజలు నిర్వహిస్తున్న పూజారి, హాజరైన భక్తులు

రంపచోడవరం: రంపచోడవరం నారాయణగిరిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు, వ్యవస్థాపక ధర్మకర్త ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ద్వారకా తిరుమల దత్తత దేవాలయం కావడంతో ద్వారక తిరుమల జేసీ వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి గురువారం ఆలయ అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

వాహన తనిఖీలు విస్తృతం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వై.రామవరం: వై.రామవరం మండల సరిహద్దు అటవీ ప్రాంత ప్రధాన రహదారుల్లో పోలీసులు వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ఒకపక్క సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ మరో పక్క సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దీంట్లో భాగంగా వై.రామవరం మండల సరిహద్దు అటవీ ప్రాంతంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో గురువారం ఎస్‌ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు, అపరిచితుల వివరాలు సేకరించారు. అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు పాల్గొన్నారు.

డేటా లింక్ బ్రిడ్జ్ టెక్నాలజీలో ఏయూకు పేటెంట్



ఆచార్య లలిత భాస్కరిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఆచార్యులు డి.లలిత భాస్కరి, పరిశోధక విద్యార్థి డాక్టర్ ఎస్.కె.ఎ.మనోజ్‌లకు ఇండియన్ పేటెంట్ ఆఫీస్ పేటెంట్ మంజూరు చేసింది. వారు కొత్తగా అభివృద్ధి చేసిన డేటా లింక్ బ్రిడ్జ్ టెక్నాలజీకి పేటెంట్ సాధించారు. ఈ విధానంలో అత్యంత భద్రతలో సమాచారాన్ని పంపే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఆచార్య లలిత భాస్కరిని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

'గోదావరి తీరాన' షూటింగ్ సందడి



జడేరు పెద్దేరు వాగు వద్ద గోదావరి తీరాన చిత్రం షూటింగ్ సందడి

గంగవరం : జడేరు గ్రామ సమీపంలోని పెద్దేరు వాగు వద్ద 'గోదావరి తీరాన' చిత్రం షూటింగ్ సందడి నెలకొంది. మండలంలోని రాజంపాలెం గిరిజన గ్రామానికి చెందిన కలుముల రవిబాబు అనే యువకుడు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మూడు రోజులపాటు గంగవరం పరిసర ప్రాంతాల్లో ఈ చిత్రానికి సంబంధించి సన్నివేశాలు చిత్రీకరిస్తామని రవిబాబు తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో కామెడీ, యాక్షన్‌తో కూడిన ఈ చిత్రాన్ని ఓటీటీలో విడుదల చేస్తామని తెలిపారు. ఈ చిత్రంలోని ముఖ్యపాత్రల్లో అభిలాష్, మధురి, రవిబాబు, యమున రచ్చ, ఇతర పాత్రల్లో అనిల్ కుమార్, అమూల్య, సురేష్, హరి బాబు నటిస్తున్నారని ఆయన తెలిపారు.

జగనన్నా.. మేమంతా సిద్ధం



- నేడు అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర
- కాకినాడ జిల్లా పర్యటన ముగించుకొని రాత్రికి గొడిచర్లలో బస చేయనున్న ముఖ్యమంత్రి
- ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ఏర్పాట్లు
- రేపు ఉదయం 9 గంటలకు బస్సు యాత్ర ప్రారంభం
- గొబ్బూరు వద్ద సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ



సీఎం బస కోసం గొడిచర్ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

సాక్షి, అనకాపల్లి: జిల్లా ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ‘మేమంతా సిద్ధం’ బస్సు యాత్ర శుక్రవారం రాత్రి జిల్లాలో ప్రవేశించనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేపట్టిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా పర్యటన ముగించుకొని రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అనకాపల్లి జిల్లాలో అడుగుపెడతారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నర్సీపట్నం రోడ్డు జంక్షన్ వద్ద ప్రవేశించి, పాయకరావుపేట వై జంక్షన్, నామవరం మీదుగా గొడిచర్ల చేరుకుంటారు. సీఎం రాత్రికి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమై పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల మీదుగా అనకాపల్లి నియోజకవర్గం తాళ్లపాలెం సమీపంలోని గొబ్బూరు వద్దకు చేరుకుంటుంది. అక్కడ సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం కశింకోట, బయ్యవరం, అనకాపల్లి మీదుగా సాగే బస్సుయాత్ర విశాఖ జిల్లాలోకి ప్రవేశించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

ఘన స్వాగతానికి ఏర్పాట్లు

ఈనెల 19వ తేదీ శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న ‘మేమంతా సిద్ధం’ బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధమవుతున్నారు. పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలకనున్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత చోడవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలనుకున్న బహిరంగ సభను కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద గొబ్బూరుకు మార్పు చేశారు. సభా ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తదితరులు గురువారం పరిశీలించారు.

గొడిచర్ల వద్ద నైట్ హాల్ట్

నక్కపల్లి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి జిల్లాలో ప్రవేశించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొడిచెర్లలో బస చేయనున్నారు. కాకినాడ జిల్లా పర్యటన పూర్తి చేసుకొని పాయకరావుపేట జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి మండలంలో గొడిచర్ల చేరుకుంటారు.

అక్కడ రాత్రి బస చేస్తారు. ఇందుకోసం గొడిచర్ల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పదెకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ సీఎంతోపాటు ఆయన వెంట ఉండే కాన్వాయ్ వాహనాలు ఉండేందుకు వీలుగా స్థలాన్ని చదును చేశారు. సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న తదితరులు సీఎం నైట్‌హాల్ట్ చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



గొబ్బూరు వద్ద బహిరంగ సభకు స్థల పరిశీలన చేస్తున్న పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి

సార్వత్రిక ఎన్నికల తొలిఘట్టం ప్రారంభం

సార్వత్రిక ఎన్నికలకు తొలిఘట్టం ప్రారంభమైంది. జిల్లాలో అరకు పార్లమెంట్‌తో పాటు పాడేరు, రంపచోడవరం, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ స్థానానికి సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్, పాడేరు అసెంబ్లీకి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్, అరకు అసెంబ్లీకి పాడేరు ఐటీడీఏ కార్యాలయం, రంపచోడవరం అసెంబ్లీకి అక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసింది. తొలిరోజు గురువారం రంపచోడవరం అసెంబ్లీకి మాత్రమే ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.



పాడేరు ఐటీడీఏ వద్ద పోలీసు బందోబస్తు



కలెక్టరేట్ రోడ్డులో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

- తొలిరోజు అరకు పార్లమెంట్, పాడేరు, అరకు అసెంబ్లీకి నామినేషన్లు నిల్
- రంపచోడవరం అసెంబ్లీకి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల దాఖలు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసు యంత్రాంగం

సాక్షి,పాడేరు: పాడేరు అసెంబ్లీకి సంబంధించి తొలిరోజు నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. గురువారం నామినేషన్లు దాఖలు కాలేదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. అరకు పార్లమెంట్ స్థానానికి కూడా నామినేషన్లు అందలేదని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్నికల అధికార వర్గాలు తెలిపాయి.

పాడేరు: అరకు అసెంబ్లీ స్థానానికి గురువారం నామినేషన్లు దాఖలు కాలేదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. పాడేరు ఐటీడీఏలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ మాట్లాడుతూ ఉదయం 11 గంటల ఉంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లను వేయడానికి ముందు అన్నీ సవ్యంగా ఉన్నాయో లేదా ఒక్కసారి పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే లోపలకు అనుమితిస్తామని ఆయన చెప్పారు. నామినేషన్ దాఖలు సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన డిపాజిట్ చెల్లించాలన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీకి తొలిరోజు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసినట్టు సబ్‌కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం పంచాయతీ సిరిగిందలపాడుకు చెందిన పాలడుగు లక్ష్మీ ప్రసన్న, పాలడుగు వెంకటేశ్వరరావు ఒక్కొక్క సెట్ నామినేషన్లు సమర్పించారని ఆయన వివరించారు. బందోబస్తును రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌కుమార్ పర్యవేక్షించారు.

ముమ్మర తనిఖీలు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిలో భాగంగా కలెక్టరేట్ రోడ్డులో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. తలారిసింగి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుకు ఇరువైపులా పోలీసులు బాంబు స్క్వాడ్,జాగిలంతో తనిఖీ చేశారు. పాడేరు అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఆర్‌వో కార్యాలయం కలెక్టరేట్‌లో ఉన్నందున భద్రత చర్యలను మరింత పటిష్టం చేశారు. శుక్రవారం నుంచి నామినేషన్లు జోరందుకునే అవకాశం ఉన్నందున పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది.

నేడు విశ్వేశ్వరరాజు నామినేషన్

- పాదయాత్రగా వెళ్లి సమర్పించేలా ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



సాక్షి,పాడేరు: పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని మోదకొండమ్మ ఆలయం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా వెళ్లి ఆర్‌వో కార్యాలయంలో నామినేషన్ సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలిరానున్నాయి. పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ, ఎమ్మెల్యేలు గొడ్డేటి మాధవి, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, పాడేరు, అరకు పార్టీ పరిశీలకులు శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి, శోభా హైమావతిదేవి, అన్నిమండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



సమావేశానికి హాజరైన బూత్ కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు

అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యం కావాలని అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. గురువారం స్థానిక ఓ ప్రవేట్ రిసార్ట్స్‌లో నియోజకవర్గ స్థాయి భూత్ కమిటీ సభ్యులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు జగనన్నను మళ్లీ సీఎం చేసే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి మద్దతు పొందాలని సూచించారు.

జగనన్న గెలుపుతోనే అన్ని వర్గాలకు మేలు: పార్టీ ఎన్నికల పరిశీలకురాలు హైమావతి

ఈ ఎన్నికల్లో జగనన్న విజయంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అరకు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు హైమావతి తెలిపారు. బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల పథకాలపై ప్రజలకు వివరించాలని కోరారు. చంద్రబాబు మోసాలను వారికి తెలియజేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ స్టార్ క్యాంపెయిన్‌నర్లుగా పని చేసి జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు.

కలిసి పనిచేద్దాం: ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

గ్రామాల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలను కలుపుకుని పనిచేద్దామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో విజయం తమ పార్టీదేనన్నారు. జగనన్న వస్తేనే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్న విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. అరకు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ బొంజిబాబు, ఎంపీపీలు శెట్టి నీలవేణి, ఈశ్వరి, రాజబాబు, ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, స్వామి, కొండబాబు, మల్లేశ్వరరావు, బాబు, ఏఎంసీ చైర్మన్ రాజరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు
- పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు
- సి–విజిల్ ద్వారా 25 ఫిర్యాదులు
- కలెక్టర్ విజయ సునీత



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా

సాక్షి,పాడేరు: వచ్చేనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ విజయ సునీత తెలిపారు. గురువారం ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 28,800 మంది అధికంగా ఉన్నారన్నారు. వీరంతా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే సుమారు 61వేల మంది ఓటర్లు అధికంగా ఉన్నారన్నారు. గత జనవరి 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన తరువాత ఫారం–6 ద్వారా 8 వేల ఓటర్లను నమోదు చేశామన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు.

పోలింగ్ ఉదయం 7 నుంచి

జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందన్నారు. 30 పోలింగ్ కేంద్రాల పేరు, లొకేషన్ మార్పు, వై.రామవరం మండలంలో ఆరు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ అనంతరం ఈవీఎంలు, ఇతర మెటీరియల్‌ను హెలికాప్టర్‌లో తరలించేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందన్నారు.

ఎన్నికల విధులపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

జిల్లాలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్ లోను నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుజేస్తున్నామని, కోడ్‌ను ఉల్లంఘించిన నలుగురు వలంటీర్లు, ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించామని చెప్పారు.సుమారు 526 మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించారన్నారు. సి–విజిల్ ద్వారా 25 ఫిర్యాదులు అందాయన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ తుహిన్‌సిన్హా

మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. గత రెండు నెలల నుంచి జిల్లాలోను, సరిహద్దులోను విస్తృత తనిఖీలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగలేదన్నారు. ప్రజలకు వారి ఆలోచన విధానాలు నచ్చకపోవడంతో సుమారు 120 మంది మావోయిస్టులు, సభ్యులు, సానుభూతిపరులు లొంగిపోయారన్నారు. వారందరు స్వేచ్ఛగా జీవించే లక్ష్యంగా పునరావాసం కల్పిస్తున్నామన్నారు. అన్ని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

రాష్ట్ర, జిల్లాల సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. గురువారం నుంచి తొమ్మిది ఎస్ఎస్‌టీ బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని, 17 ఎఫ్ఎస్‌టీ బృందాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఎన్నికల బందోబస్తుకు కేంద్ర పోలీసు బలగాలు, గ్రేహౌండ్స్, ప్రత్యేక పోలీసు పార్టీలను వినియోగిస్తున్నామని చెప్పారు. ,ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉన్న కంట్రోల్‌రూమ్‌లతో పాటు సబ్ డివిజన్ స్థాయిలో నాలుగు, జిల్లా స్థాయిలో ఒక కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీటిద్వారా 24గంటల పాటు నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా వివరించారు.

ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు



కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజీ

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం మత్స్యలింగేశ్వరస్వామి ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసినట్టు మత్స్యలింగేశ్వర స్వామి సమగ్రాభివృద్ధి సేవా సేవ సంఘం, ఆలయ కమిటీ అధ్యక్షుడు తమర్బ అప్పారావు తెలిపారు. దీనిలో భాగంగా ఎనిమిది చోట్ల ఏర్పాటుచేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పర్దాన కార్యదర్శి మఠం సూర్యనారాయణ నాయుడు, మత్స్యకొండబాబు, పాత్రుడు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యార్థిని కేజీహెచ్‌కు తరలింపు

తల్లిదండ్రులకు అధికారుల కౌన్సెలింగ్



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్ కిరణ్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

చింతపల్లి రూరల్: ఉన్నత వైద్యానికి నిరాకరించిన విద్యార్థి తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి విశాఖ కేజీహెచ్‌కు తరలించేలా చర్యలు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కిటుమల పంచాయతీ పులిగొంది గ్రామానికి చెందిన కొర్రా సిద్దు అంజలి శనివారం పంచాయతీ జాజులపాలెం గిరిజన సంక్షేమశాఖ బాలురు ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం అతని శరీరం పొంగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు తాజంగి పీహెచ్‌సీకి మంగళవారం తీసుకువచ్చారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి బుధవారం తీసుకువచ్చారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం చికిత్స అందించారు. పరిస్థితి కాస్త మెరుగుపడింది. ఉన్నత వైద్యం అందించేందుకు ఆస్పత్రి వైద్యులు సిఫార్సు చేశారు. ఈ మేరకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సమాచారమిచ్చారు. అయితే కేజీహెచ్‌కు తీసుకువెళ్లేందుకు వారు సుముఖత తెలపలేదు. వెంటనే ఎస్ఐ అరుణ్ కిరణ్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి తల్లిదండ్రులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో విద్యార్థి సిద్దును కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

ఫ్యాను జోరు.. కూటమి బేజారు 8లో

విద్యార్థిని కొట్టిన టీచర్ విధుల నుంచి తొలగింపు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో నిర్వహిస్తున్న అడ్డతీగల ఏకలవ్య పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీరామ రెడ్డిని చితకబాదిన తెలుగు గెస్టు టీచర్ శివకుమార్‌పై ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే విచారణకు ఆదేశించారు. తమ కుమారుడికి టీచర్ శివకుమార్ వెట్టిచాకిరి చేయిండమే కాకుండా బంధించిన కొట్టారని ఐటీడీఏ పీవోకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ఫణికుమార్ వివరాలు అందజేస్తు శివకుమార్‌ను గురువారం ఐటీడీఏ పీవో వద్ద హాజరు పరచగా అతనిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఆదేశించారని, విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని పీవో పేర్కొన్నట్టు చెప్పారు.

500 లీటర్ల సారా స్వాధీనం

- ఒకరి అరెస్టు, ఆటో సీజ్



పట్టుబడిన సారా సామగ్రి, ఆటోతో ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది

పాడేరు: ఎన్నికల వేళ సారా, అక్రమ మద్యం, గంజాయి రవాణా జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం కామయ్యపేట జంక్షన్ వద్ద తమ సిబ్బంది వావాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ ఆటోలో తరలిస్తున్న 500 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. దీంతో ఆటోను సీజ్ చేసి సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సారా తరలిస్తున్న వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఎగ పేడాపల్లి గ్రామంలో సారా తయారీ చేస్తున్నట్టు తెలిసిందన్నారు. తమ సిబ్బంది ఎగ పేడాపల్లి గ్రామంలో సారా తయారీ కేంద్రాల వద్దకు వెళ్లి తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారన్నారు. గ్రామాల్లో నిషేధిత సారా తయారీ, అమ్మకాలు చేపట్టినా, గంజాయి రవాణా, అక్రమ మద్యం నిల్వలు ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దాడుల్లో పాడేరు ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాను జోరు.. కూటమి బేజారు

- నామినేషన్ల ప్రక్రియ మొదలైనా తెగని టీడీపీ సీట్ల పంచాయితీ
- మాడుగుల, అరకు నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- దక్షిణ నియోజకవర్గంలో చల్లారని 'గ్లాసు' తుపాను
- వంశీకృష్ణకు వద్దే వద్దంటున్న జనసేన నాయకులు
- గందరగోళంలో మూడు పార్టీల క్యాడర్



సాక్షి, విశాఖపట్నం: ఓ వైపు భానుడి భగభగలు.. మరో వైపు సార్వత్రిక ఎన్నికల వేడి సెగలు పుట్టిస్తుంటే.. కూటమిలో ఇంకా టికెట్ల పంచాయితీ కుంపటి రగులుతూనే ఉంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా.. సీట్ల సర్దుబాటులో నెలకొన్న గందరగోళం కొనసాగుతూనే ఉంది. చంద్రబాబు మార్పుల వైఖరికి జనసేన, బీజేపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. మాడుగులలో సైకిల్ తొక్కేదెవరో తెలియక అయోమయంలో క్యాడర్ ఉండగా.. అరకులో కమలం వికసించకుండా టీడీపీ యత్నాలు జోరందుకున్నాయి. విశాఖ దక్షిణంలో జనసేన అభ్యర్థి వద్దేవద్దంటూ ఆ పార్టీ నేతలే తేల్చి చెబుతుండటంతో ఎటుపోవాలో తెలియక క్యాడర్ ఊగిసలాడుతోంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ తరుణంలో వైఎస్సార్ సీపీ దూకుడుగా వ్యవహరిస్తుంటే.. కూటమి మాత్రం పొత్తు చిక్కుల్లో కూరుకుపోయింది. చివరి నిమిషం వరకూ ఎవరికి సీటు దక్కుతుందో తెలియక అయోమయంలో టీడీపీ శ్రేణులు కలవరపడుతున్నారు. ముఖ్యంగా మాడుగుల, అరకు నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. మాడుగులలో తొలుత పైలా ప్రసాదరావుకు చంద్రబాబు సీటు ప్రకటించారు. దీంతో ఆయన ప్రచారానికి ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేశారు. అయితే తాజాగా ఈ సీటును తనకే కేటాయించారని బండారు ప్రకటించుకున్నారు. దీంతో పైలా వర్గం కోపంతో రగిలిపోతోంది. ఇన్నాళ్లూ ఈ టికెట్ ఆశించిన గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్‌లకు భంగపాటు తప్పలేదు. పెందుర్తి నుంచి మాడుగులకు బండారు రావడంతో అక్కడ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది. మాడుగులలో గురువారం బండారు నిర్వహించిన సమావేశానికి పైలా గైర్హాజరయ్యారు. బండారు, చంద్రబాబు తీరుపై టీడీపీ శ్రేణులు ఆగ్రహంతో పాటు అయోమయానికి గురవుతున్నారు.

అరకులోనూ అదే దుస్థితి

రాష్ట్రంలోనే మొట్టమొదట ప్రకటించిన టీడీపీ సీటు అరకు నియోజకవర్గానిదే. దొన్ను దొర అరకు అభ్యర్థి అంటూ బాబు ప్రజాగళం సభలో ప్రకటించారు. అప్పటి నుంచి ప్రచారం నిర్వహించిన దొన్ను దొరకు చివరికి భంగపాటు తప్పలేదు. ఆ స్థానాన్ని బీజేపీకి ఇస్తున్నట్లు బాబు ప్రకటించడంతో అసమ్మతి భగ్గుమంది. వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు తన తడాఖా చూపిస్తానంటూ దొన్నుదొర బహిరంగంగా సవాల్ విసిరారు. దీంతో అరకులో కూటమి రెండు ముక్కలైంది. బీజేపీ అభ్యర్థితో పాటు నడవాలా..? రెబల్‌గా అడుగులు వేస్తున్న దొన్ను దొరతో ఉండాలా అని తేల్చుకోలేక మూడు పార్టీల క్యాడర్ గందరగోళంలో ఉంది. మరోవైపు అరకులో కమలం వికసించకుండా ఆపేందుకు టీడీపీ యత్నాలు కొనసాగిస్తూనే ఉంది.

జనసేనది ఇదే పరిస్థితి

అటు జనసేనకు సంబంధించి దక్షిణ నియోజకవర్గంలోనూ అసమ్మతి ఇంకా కొనసాగుతోంది. బీఫారం దక్కించుకున్న వంశీకృష్ణకు సీటు ఇవ్వొద్దంటూ పలువురు నేతలు ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నారు. వంశీని కొనసాగిస్తే.. ఓడించి తీరుతామంటూ తేల్చి చెబుతున్నారు. జనసేనలోనే వర్గ పోరు ఉండటంతో.. ప్రచారానికి వెళ్లకుండా ఆ పార్టీ శ్రేణులు ఇంటికే పరిమితమవుతున్నారు. కీలక నేతలు ప్రచారానికి దుమ్మా కొడుతుండటంతో.. వారు లేకుండా ప్రచారానికి వెళ్తే.. తమని బ్లాక్ లిస్టులో పెడతారేమోనన్న సంకట స్థితిలో మూడు పార్టీల క్యాడర్‌లో ఉంది. బయటికి రాలేక.. నియోజకవర్గంలో తిరగలేక.. నాయకులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో ఆయా పార్టీల పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది. మొత్తానికి టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు పొడిచినా.. అది మునిగిపోయే పడవ మాత్రమేనన్న తత్వం ఆ పార్టీల కార్యకర్తల్లోనూ బలంగా నాటుకుంది.

62 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

మోతుగూడెం: వై.రామవరం మండలం డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శివకుమార్ చెప్పారు. ఈ కేసులో నలుగురు నిందితులను, ఒక బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. డొంకరాయిలో చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా బైక్ డిక్కీలో రెండు కిలోల గంజాయితో పాటు ఇద్దరు నిందితులను అదుపులో తీసుకున్నట్టు చెప్పారు. మంగంపాడు గ్రామం నుంచి వస్తున్న ఆటోని తనిఖీ చేయగా 60 కిలోల గంజాయి దొరికిందని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రెండు కేసుల్లో దొరికిన గంజాయి విలువ సుమారు రూ. 3లక్షలు ఉంటుందని తెలిపారు. ఆయా కేసుల్లో నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్టు చెప్పారు.

గడ్డి ట్రాక్టరు దగ్ధం

మాడుగుల రూరల్ : వీరవల్లి అగ్రహారం పంచాయతీ శివారు లక్ష్మీపురంలో షార్టు సర్క్యూట్ వల్ల గురువారం గడ్డి ట్రాక్టరు దగ్ధమైంది. ట్రాక్టరుతో గడ్డి తీసుకెళ్తుండగా లక్ష్మీపురం గ్రామం వద్ద విద్యుత్ వైర్లు తగిలాయి. ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్ని మాపక కేంద్రం దళాధికారి రాజేశ్వరావు తెలిపారు. సకాలంలో అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఇంజిన్‌తో మంటలను ఆర్పివేసినట్టు రాజేశ్వరావు తెలిపారు.

జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాల్సిందే



మాట్లాడుతున్న పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల అత్యవసర సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన రాజవొమ్మంగి జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి తన పదవికి కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న పేరుతో, వైఎస్సార్‌సీపీ జెండాతో జెడ్పీటీసీగా నెగ్గిన ఒడుగుల జ్యోతి తక్షణమే జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టారు. ప్రతిపక్షాల ప్రలోభాలకు లొంగి, తమపై తప్పుడు నిందలు వేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటివరకు ఏ పార్టీతో ప్రజల్లో గుర్తింపు, మనుగడ జరిగిందో మరచిపోవద్దన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, ఆగూరి శుభలక్ష్మి, సవిరెల చంద్రుడు, దాసరి నాగేశ్వరరావు, కించు వెంకటలక్ష్మి ఎంపీటీసీ సభ్యురాలు కానెం అచ్చియమ్మ, నాయకులు కుశరాజు, దుర్గాప్రసాద్, కామేష్, శింగిరెడ్డి రవి, జాన్‌బాబు పాల్గొన్నారు.

90 మద్యం సీసాలు పట్టివేత

ఎస్.రాయవరం : దార్లపూడి గ్రామంలో ఓ మహిళ వద్ద అక్రమంగా నిల్వ చేసిన 90 మద్యం సీసాలను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ వద్ద పెద్ద ఎత్తున మద్యం సీసాలు ఉన్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఈ మద్యం బాటిళ్లు వివిధ మద్యం షాపుల నుంచి సేకరించి బెల్టు దుకాణం నిర్వహించేందుకు నిల్వ చేసినట్టు తెలిపిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లు సీజ్ చేశామన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టండి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



బొర్నగూడెంలో ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: ప్రతి కుటుంబం సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని కోరుకొనే వైఎస్సార్‌సీపీకే రానున్న ఎన్నికల్లో పట్టం కట్టండి అంటూ రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని చెరకుంపాలెం, సంజీవనగరం, ఉర్లాకులపాడు, బోర్నగూడెం, అమీనాబాద్‌కాలనీ, వెలగలపాలెం, చిన్నయ్యపాలెం గ్రామాల్లో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

దేశానికే ఆదర్శం..జగనన్న పాలన

గత టీడీపీ ప్రభుత్వ పాలకులు ప్రజలను ఎంతో మోసం చేశారన్నారు. స్వచ్ఛభారత్ పథకం కింద మండలంలో ప్రతి కుటుంబానికి మంజూరైన మరుగుదొడ్లకు చెందిన కోట్లాది రూపాయల నిధులను దిగమింగారన్నారు. నేడు సీఎం జగనన్న పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో సచివాలయం, వెల్‌నెస్ భవనాలు, రైతు భరోసా భవనాలు రూపుదిద్దుకోవడంతో గ్రామాల ముఖచిత్రం సభూతో నఃభవిష్యతి అన్నట్టుగా మెరుగుపడిందన్నారు. ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ ఘనత మన జగనన్నదేనన్నారు. డిజిటలైజేషన్ ద్వారా సంక్షేమ పథకాలను దరఖాస్తు చేసుకోవడాన్ని మన సీఎం ఎంతో సులభతరం చేశారన్నారు. ఊహకందని ఎన్నెన్నో సంక్షేమ పథకాలు మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. విద్యుత్ లేని గ్రామాలకు విద్యుత్, ఇంటింటికీ కుళాయి, సీసీరోడ్లు వంటి అనేక అభివృద్ధి పథకాలు అమలు చేసిన ఘనత మనకే దక్కుతుందన్నారు. రైతు భరోసా ద్వారా సాగు పెట్టుబడిసాయం, ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాల పంపిణీ జరిగిందన్నారు. విద్యకు పెద్ద పీట వేస్తున్న మన సీఎం జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, నాడు-నేడు పథకాల ద్వారా కోట్లాది రూపాయలతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలను గ్రామస్తులకు ఆమె పంచిపెట్టారు. సంక్షేమం, అభివృద్ధి మన ప్రభుత్వానికి రెండు కళ్లు అని, మరోసారి ఈ ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా దీవించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థినిగా నేను అంటే నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న డాక్టర్ తనూజరాణిలను గెలిపించాలని అభ్యర్థించారు.

మండల పార్టీ అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, తొంటా ఆదిరాజు, దాసరి నాగేశ్వరరావు, కించు వెంకటలక్ష్మి, ఆగూరి శుభలక్ష్మి, భీంరెడ్డి శుభలక్ష్మి, సవిరెల చంద్రుడు, ఎంపీటీసీ సభ్యులు నిర్మలాదేవి, గంగదుర్గ, నాయకులు కుశరాజు, దుర్గాప్రసాద్, వీరబాబు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎయిర్‌పోర్టు దూకుడు!

- 27 లక్షలు దాటిన ప్రయాణికులు
- గత ఏడాది కంటే 10.19 శాతం పెరుగుదల

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల తాకిడిలో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం దూకుడులో ఉంది. ఏటికేడాది ఈ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ అదే తీరును కనబరిచింది. 2022-23లో ఈ విమానాశ్రయం నుంచి 25,00,654 మంది రాకపోకలు సాగించగా, ఈ సంవత్సరం 27,84,428కు పెరిగారు. గతేడాదితో పోల్చుకుంటే 2,85,974 మంది అధికంగా ప్రయాణించారు. అంటే 10.19 శాతం వృద్ధి రేటు నమోదైంది. కాగా 2022-23లో దేశీయ ప్రయాణికులు 24,35,320 మంది, విదేశీ ప్రయాణికులు ఉండగా, 2023-24లో దేశీయ ప్రయాణికులు 27,18,314, విదేశీ ప్రయాణికులు 66,116 మంది ఉన్నారు. ఈ లెక్కన గత ఏడాదికంటే స్వదేశీ ప్రయాణికులు 2,83,774 మంది, విదేశీ ప్రయాణికులు 2,982 మంది పెరిగారన్నమాట! గత మే నెలలో అత్యధికంగా 2,96,628 మంది, అత్యల్పంగా ఫిబ్రవరిలో 1,96,013 మంది ప్రయాణాలు సాగించారు. మరోవైపు ఈ విమానాశ్రయం నుంచి దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ఈ నెల 9న విశాఖ నుంచి బ్యాంకాక్‌కు కొత్త అంతర్జాతీయ సర్వీసు, 16న హైదరాబాద్‌కు రెండు సరీ్వసులు ప్రారంభమయ్యాయి. ఈనెల 26న మలేసియాకు మరో కొత్త విమాన సర్వీసును ప్రారంభించనున్నారు. అలాగే పెరుగుతున్న ప్రయాణికులు, విమాన సర్వీసులను దృష్టిలో ఉంచుకుని ఈ ఎయిర్‌పోర్టులో మరిన్ని సదుపాయాలను సమకూరుస్తున్నారు. ప్రయాణ ప్రక్రియ వేగవంతం, సులభతరమయ్యేందుకు వీలుగా ఇన్‌లైన్ బ్యాగేజీ స్క్రీనింగ్, డిజి యాత్ర సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల రాకపోకల్లో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం మూడు మిలియన్ల (30 లక్షల) మైలు రాయిని అధిగమిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.కుమార్‌రాజా, ఒ.నరేష్ కుమార్, డీఎస్ వర్మ తెలిపారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



చింతపల్లిలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



అనంతగిరిలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

చింతపల్లిరూరల్: మండలంలో చింతపల్లి, 1,2, తమ్మంగుల, గొందిపాకలు, అంజలీ శనివారం, బలపం, పెదబరడ, తాజంగి, కిటుముల పంచాయతీలకు చెందిన 110 మంది గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో వీర సాయిబాబుకి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రతి పక్షాల విమర్శలకు మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ఇకపై వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి పనిచేస్తామన్నారు.


అనంతగిరి: మండలంలో కివర్ల, బొర్రా, అనంతగిరి, టోకూరు, గుమ్మకోట, ఎగువశోభ, గుమ్మ, పెదబిడ్డ, కొత్తూరు, లంగుపర్తి, రొంపల్లి, వాలసీ, కొండిబ 13 సచివాలయాల పరిధిలోని విధులు నిర్వహిస్తున్న 85 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో నగేష్‌కు అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ ప్రతిపక్షాల తీవ్ర విమర్శలకు మనస్తాపం చెందామని, రాజీనామ చేస్తున్నామన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా వలంటీర్లలందరం రాజీనామా చేసినట్టు చెప్పారు. రాష్ట్రానికి జగనన్న అవసరం ఎంతైన ఉందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్న మళ్లీ కావాలి అంటూ వలంటీర్లు చెప్పారు.

కొయ్యూరు: మర్రివాడ సచివాలయం పరిధిలో గురువారం ఏడుగురు, ఆడాకుల పరిధిలో ఆరుగురు కలిసి మొత్తం 13 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వలంటీర్లను ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శలు చేయడం మనస్థాపానికి గురిచేస్తుందని, ఈ మేరకు రాజీనామాలు చేశామన్నారు.

రెండు గ్రామాల్లో సారా బట్టీల ధ్వంసం



దిడ్డి గ్రామంలో సారా బట్టీ ధ్వంసం చేస్తున్న ఎస్ఐ తదితరులు



కసిరెడ్డిపాలెంలో సామగ్రి ధ్వంసం చేస్తున్న పోలీసులు

రావికమతం : దిడ్డి,కసిరెడ్డిపాలెం గ్రామ శివార్లలో సారా తయారీ చేసేందుకు సిద్ధంగా ఉన్న 1,900 లీటర్ల పులుపును, పెద్ద ఎత్తున పరికరాలను ధ్వంసం చేశామని రావికమతం ఎస్ఐ ధనంజయ్ నాయుడు గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు ఆ గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో పాటు దాడులు చేశామన్నారు. గ్రామ శివారు కొండపై సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,900 లీటర్ల పులుపును, పెద్ద ఎత్తున సామగ్రిని ధ్వంసం చేశామన్నారు.

11 ఎకరాల్లో జీడితోట దగ్ధం



కాలిపోయిన జీడితోట

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన భీమరాతి మణి, శాంతి, రమణమ్మ, తంటపురెడ్డి జయ, వెచ్చా కొండమ్మ అనే ఐదుగురు రైతులకు చెందిన 11 ఎకరాల్లోని జీడి తోట ప్రమాదవశాత్తూ గురువారం కాలిపోయింది. ఆకతాయిలు, మందుబాబులు ఆ తోటల్లో తరచూ పార్టీలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో విచ్చలవిడిగా సిగరెట్లు కాలుస్తూ నిర్లక్ష్యంగా పారేస్తున్నారు. పలుమార్లు అటువంటి ఆకతాయిలను ఆ రైతులు మందలించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్ అంటుకుని ఆ రైతులకు చెందిన జీడితోట కాలిపోయింది. మండే ఎండ ఆపై గాలి వీయడంతో తోటను రక్షించుకోలేకపోయామని రైతులు వాపోయారు. రావికమతం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లేకుంటే మరో 15 ఎకరాలకు మంటలు అంటుకుని ఉండేవన్నారు. ఈ ప్రమాదంలో బాధితులకు రూ. 6లక్షల వరకూ ఆస్తి నష్ట సంభవించిందని ప్రాథమిక అంచనా. ఈ ఏడాది జీడి బాగా కాసిందని రెండు రోజుల నుంచే పిక్క ఏరుతున్నామని ఇంతలోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు ఆవేదన చెందారు.